దిన పత్రిక
తొలి సమయం
ఆదివారం । 10 । మే । 2026

## అదుపుతప్పి కారు బోల్తా..

## పలువురికి స్వల్ప గాయాలు





తొలి సమయం కొత్తగూడ 09 మే 2026

కొత్తగూడ మండల కేంద్రం సమీపంలో కారు అదుపుతప్పి బోల్తా కొట్టింది ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. మండలంలోని తాటివారి వేంపల్లి గ్రామానికి చెందిన ఒక కుటుంబం అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం కారులో నర్సంపేట ఆసుపత్రికి బయలుదేరారు. కొత్తగూడ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న ఒక టాటా ఏస్ వాహనాన్ని తప్పించబోయి, డ్రైవర్ అదుపు కోల్పోవడంతో కారు రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది.ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి కారులో ఉన్న వారిని బయటకు తీశారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ లో సమీప ఆసుపత్రికి తరలించారు

## అసత్య ఆరోపణలతో పబ్బం గడుపుకోవద్దు

## కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి

తొలి సమయం,ఇల్లందు;మే, 09:

ఇల్లందు పట్టణ రాజకీయాల్లో వ్యక్తిగత ఆరోపణలు, విమర్శలతో ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి సూచించారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల వరకు మాత్రమే రాజకీయాలు పరిమితం కావాలని, ఆ తర్వాత ప్రజా సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలే ప్రజాప్రతినిధుల ప్రధాన బాధ్యతగా ఉండాలని పేర్కొన్నారు.ప్రజాసేవ చేయడానికి అధికార పదవి ఒక్కటే మార్గం కాదని, రాజకీయాలు మరియు సామాజిక సేవలో ఉన్న ప్రతి ఒక్కరూ ప్రజల అవసరాలను గుర్తించి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అయితే కొందరు ప్రజల సమస్యలను పక్కనపెట్టి వ్యక్తిగత ప్రయోజనాల కోసం రాజకీయాలను వాడుకుంటూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.స్థానిక 13వ వార్డు కౌన్సిలర్ దండు సారయ్యపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించిన సాంబమూర్తి, ఎన్నికల్లో గెలిచిన తర్వాత ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా ఇతరులు చేస్తున్న మంచి పనులను జీర్ణించుకోలేక అసత్య ఆరోపణలకు దిగుతున్నారని ఆరోపించారు. తన కుటుంబ సభ్యులపై నిరాధార ఆరోపణలు చేస్తూ రాజకీయ లాభం పొందాలని ప్రయత్నించడం సరికాదన్నారు.ప్రజల బలహీనతలను ఆసరాగా చేసుకుని కొందరు క్షుద్ర పూజలు, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆరోగ్య సమస్యలు నయం చేస్తామని, ఇళ్లలో లంకె బిందెలు ఉన్నాయని చెప్పి అమాయక ప్రజల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసి మోసాలకు పాల్పడుతున్నారని ఆయన విమర్శించారు. ఇటువంటి చర్యలు ప్రజల్లో



అపోహలు, భయాందోళనలు కలిగిస్తున్నాయని అన్నారు.రాజకీయంగా విభేదిస్తున్న కొంతమందిని వెంటబెట్టుకుని వచ్చి తనపై ఆరోపణలు చేయడం ద్వారా ప్రజల దృష్టి మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని సాంబమూర్తి ఆరోపించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టి సారించి అధికారులను సంప్రదించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత విమర్శలకు దిగడం మానుకుని ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయాలని, ఇప్పటికైనా అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని ఆయన హితవు పలికారు.

## మృతురాలి కుటుంబానికి

## ఆర్థిక సహాయం



తొలి సమయం శ్రీరంగాపూర్ మే 9

శ్రీరంగాపూర్ మండల కేంద్రం అంబేద్కర్ కాలనీకి చెందిన జమ్మన్నగారి రాములమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది వారి కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృశ్య అంబేద్కర్ యువజన సంఘం ఉద్యోగస్తులు రాజకీయ ప్రజా ప్రజా ప్రతినిధులు ఉపాధి కార్మికులు ప్రతి ఒక్కరు వారికి తోచిన విధంగా ఆర్థిక సహాయం అందించడం జరిగింది ఇట్టి మొత్తం 5000 రూపాయలు అంబేద్కర్ యువజన సంఘం సహాయ కార్యదర్శి రాము, ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, కార్యవర్గ సభ్యులు అశోక్, ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులకు అందజేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో రవికుమార్, సురేష్ చిన్న అయ్యన్న పుల్లయ్య మరియు కాలనీ వాసులు మహిళలు పాల్గొనడం జరిగింది.

## రేపల్లెవాడ ధాన్యం కొనుగోలు కేంద్రంలో

## అవినీతి అరికట్టాలి: బీఆర్ఎస్ పార్టీ డిమాండ్



తొలి సమయం, ఇల్లందు;మే, 09:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం రేపల్లెవాడ ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న అవకతవకలు, దళారీ వ్యవస్థను వెంటనే అరికట్టాలని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గత 25 రోజులుగా రైతులు ధాన్యం కొనుగోలు కోసం కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన సమయంలో ధాన్యం కొనుగోలు జరగకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొనుగోలు కేంద్రంలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో పాటు గోనె సంచులు కూడా అందించకపోవడం రైతులను మరింత ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు.అకాల వర్షాల కారణంగా కొనుగోలు కేంద్రంలో నిల్వ ఉంచిన ధాన్యం మొలకెత్తుతోందని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల దళారులు పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకుని రైతులను దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు.ప్రభుత్వ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను అరికట్టి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జోక్యం చేసుకుని సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మాజీ గ్రంథాలయ చైర్మన్ దిండిగాల. రాజేందర్, బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు అజ్మీర్ బాబు సింగ్ నాయక్, అడ్వకేట్ సువర్ణపాక సత్యనారాయణ, మూడు కృష్ణప్రసాద్, మాజీ పట్టణ అధ్యక్షుడు జబ్బర్, సర్పంచులు ఏపే .శంకర్, ఎట్టి రమణతో పాటు మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మొక్కజొన్న నిల్వ ప్రక్రియ ప్రారంభం

### రైతులకు అండగా ప్రజా ప్రభుత్వం : ఏ.ఎం.సి

### చైర్మన్ బానోత్ రాంబాబు



తొలి సమయం, ఇల్లందు;మే, 09:

ఇల్లందు మార్కెట్ పరిధిలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని గిడ్డంగుల్లో నిల్వ చేసే ప్రక్రియను శనివారం ప్రారంభించారు. ప్రజా ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ, అకాల వర్షాల కారణంగా రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటోందని ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు తెలిపారు. ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు ఎ . ఎం.సి గోదాములో మొక్కజొన్న నిల్వ ప్రక్రియ ప్రారంభమైంది. ఇటీవల కురిసిన అకాల వర్షాలతో రైతులు ఆరుకాలం శ్రమించి పండించిన పంట నష్టపోకూడదనే



ఉద్దేశంతో వెంటనే నిల్వ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే అధికారులు కు సూచించిన విషయం తెలిసిందే. ఆ ఆదేశాల అమలులో భాగంగా శనివారం ఎ .ఎం.సి కార్యాలయంలోని మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గిడ్డంగిలో మొక్కజొన్న నిల్వ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు మాట్లాడుతూ రైతుల కష్టాన్ని ప్రభుత్వం గుర్తిస్తోందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు, రవాణా, నిల్వ ప్రక్రియలను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. రైతులు ధైర్యంగా తమ పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు మండల మాజీ వైస్ ఎంపీపీ మండల రాంమహేష్, సొసైటీ సీఈఓ హీరాలాల్, సొసైటీ డైరెక్టర్ కునుసోత్ రాము, దండుగుల శివ, మార్కెట్ సిబ్బంది పిక్లా, రమేష్, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సుదిమళ్ళ గ్రామంలో రూ.1 కోటి వ్యయంతో గ్రావెల్ రోడ్ల పనులకు శ్రీకారం

### - పనులను ప్రారంభించిన

### ఎమ్మెల్యే కోరం కనకయ్య

తొలి సమయం,ఇల్లందు;మే, 09:

ఇల్లందు మండలం సుదిమళ్ళ గ్రామపంచాయతీ పరిధిలో గ్రామ శివారు నుంచి పంట పొలాలకు వెళ్లే మార్గాల అభివృద్ధి కోసం రూ.1 కోటి వ్యయంతో చేపట్టనున్న ఐదు గ్రావెల్ రోడ్ల నిర్మాణ పనులను శనివారం గౌరవ ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు.రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే టెంకాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు రవాణా సౌకర్యాలు మెరుగుపడేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పంట పొలాలకు వెళ్లే మార్గాలు బాగుంటే రైతులు వ్యవసాయ కార్యకలాపాలు సులభంగా నిర్వహించగలరని పేర్కొన్నారు.గ్రామ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి రాజీ ఉండదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ముఖ్యంగా గ్రామీణ రహదారుల అభివృద్ధితో రైతులకు, గ్రామ ప్రజలకు ఎంతో



మేలు జరుగుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు పాల్గొన్నారు. అలాగే స్థానిక సర్పంచ్ కుంజా సుగనయ్య, ఉప సర్పంచ్ ఊకే లక్ష్మీనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ మండల రాంమహేష్, ఇల్లందు సొసైటీ చైర్మన్ మెట్ల కృష్ణ, మాజీ ఎంపీపీ మోకాళ్ల వెంకటమ్మ, సర్పంచుల సంఘం గౌరవ అధ్యక్షురాలు పాయం లలిత, సొసైటీ డైరెక్టర్ కునుసోత్ రాము, సర్పంచ్ వల్లాల మంగమ్మ, నాయకులు జానిపాషా, గ్రామ పెద్దలు, పీఆర్ ఏఈ రాజు, గ్రామ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.




## ప్రధాని నరేంద్ర మోదీ సభను

## విజయవంతం చేద్దాం

### బీజేపీ కొత్తగూడెం టౌన్ ప్రెసిడెంట్ శీలం విద్యా సాగర్

తొలిసమయం, కొత్తగూడెం, మే 09 :



హైదరాబాద్‌లో నేడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన సందర్భంగా నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ కొత్తగూడెం టౌన్ ప్రెసిడెంట్ శీలం విద్యా సాగర్ పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన కార్యక్రమాల నిమిత్తం ప్రధాని మోదీ హైదరాబాద్‌కు విచ్చేస్తున్న నేపథ్యంలో, సాయంత్రం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే భారీ సభకు ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సహకారం, జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టులు, మౌలిక వసతుల విస్తరణ, పరిశ్రమల అభివృద్ధి వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతోందని, తెలంగాణకు కూడా కేంద్రం విశేష ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.దేశాభివృద్ధి, తెలంగాణ ప్రగతికి ప్రధాని మోదీ నాయకత్వం ఎంతో కీలకమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ సభకు హాజరై మోదీకి ఘన స్వాగతం పలకాలన్నారు. ముఖ్యంగా యువత, మేధావులు, వ్యాపారవేత్తలు, ఉద్యోగులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## నామినేటెడ్ పదవుల్లో యాదవులకు అన్యాయం..

### ముగ్గురు మంత్రులను కలుస్తాం - అఖిల భారత

### యాదవ మహాసభ నాయకులు

తొలి సమయం, ఖమ్మం; మే, 09:

ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేసిన యాదవులకు నామినేటెడ్ పదవుల విషయంలో తీవ్ర అన్యాయం జరిగిందని అఖిల భారత యాదవ మహాసభ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులను కలిసి వినతిపత్రాలు సమర్పిస్తామని, అవసరమైతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.శనివారం ఖమ్మం జిల్లా అఖిల భారత యాదవ మహాసభ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకటనరసయ్య, జిల్లా యాదవ యువజన అధ్యక్షుడు చిత్తారు సింహాద్రి యాదవ్, రాష్ట్ర ఉద్యోగుల విభాగ నాయకుడు దుబాకుల శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన నామినేటెడ్ పదవుల నియామకాల తర్వాత బీసీ వర్గాల్లో, ముఖ్యంగా యాదవులలో తీవ్ర అసంతృప్తి నెలకొందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అధిక జనాభా కలిగిన యాదవ సమాజానికి రాజకీయ పదవుల కేటాయింపులో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.గత ప్రభుత్వ హయాంలో యాదవులకు ఐదుగురు ఎమ్మెల్యేలు, ఒక రాజ్యసభ సభ్యుడు, రెండు ఎమ్మెల్సీ స్థానాలు, ఒక మంత్రి పదవి, కార్పొరేషన్ చైర్మన్ పోస్టులు, డీసీసీబీ చైర్మన్ పదవులు లభించాయని గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఖమ్మం జిల్లాకు చెందిన యాదవులకు ఒక్క రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవి కూడా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు.ఎన్నికల




సమయంలో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా పనిచేసిన యాదవ నాయకులను ఎన్నికల అనంతరం పూర్తిగా పక్కన పెట్టారని ఆరోపించారు. ముఖ్యంగా అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్ గత ఎన్నికల్లో జిల్లా మొత్తం పర్యటించి యాదవుల ప్రజాసభలు నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేశారని తెలిపారు.మల్లి బాబు యాదవ్‌పై గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుల కారణంగా 57 రోజుల పాటు జైలు జీవితం గడపాల్సి వచ్చిందని, రాజకీయంగా, ఆర్థికంగా, కుటుంబ పరంగా తీవ్ర నష్టాలు ఎదుర్కొన్నారని చెప్పారు. ఈ విషయాలు జిల్లాలోని ఎమ్మెల్యేలు, మంత్రులకు తెలిసినా ఇప్పటివరకు సరైన గుర్తింపు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు.యాదవ సమాజాన్ని కేవలం ఓట్ల కోసం ఉపయోగించుకోవద్దని, తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యాదవులను చులకనగా చూడొద్దని, అవసరమైతే జిల్లాలోని యాదవులంతా ఏకమై పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షురాలు కనకబండి విజయలక్ష్మి, మాజీ కార్పొరేటర్ చేతుల నాగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు మొరిమేకల కోటయ్య, సత్తి వెంకన్న, తెల్లబోయిన రమణ, తోడేటి లింగరాజు, పొదిల భూపతి, వాకదానివల రాజు, రాగం బాబురావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.